ఒకే భూమి రెండు చోట్ల రిజిస్ట్రేషన్

- పరిధి మార్చి.. రికార్డులు మరిచి పట్టా
- సబ్ రిజిస్ట్రేషన్ల పరిధి మారినా జరగని రికార్డుల బదలాయింపు
- అధికారుల నిర్లక్ష్యంతో అనేక భూ సమస్యలు!
- ఒకే స్థలానికి రెండు, మూడేసి రిజిస్ట్రేషన్లు
- రికార్డులు ఒకే చోట లేక నష్టపోతున్న బాధితులు
- విషయం తెలిసి లబోదిబోమంటూ ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు

కూల్చివేసిన నిర్మాణం

జగిత్యాల పట్టణానికి చెందిన గోక గణేశ్ ప్రాథమిక వైద్యుడిగా పనిచేసేవాడు. తన ఇంటి నిర్మాణం కోసం ధరూర్ గ్రామానికి చెందిన ఆరెల్లి మొండయ్య వద్ద సర్వేనంబర్ 179/ఈలోని 212.80 గజాల స్థలాన్ని 2015లో కొనుగోలు చేశాడు. మొండయ్య గణేశ్‌కు ఈ భూమిని 2015 జూన్ 20న మల్యాల సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో (డాక్యుమెంట్ నంబర్ 1997/2015) రిజిస్ట్రేషన్ చేశాడు. రెండేండ్లు గడిచిన తర్వాత మళ్లీ గణేశ్‌ను కలిసి, గతంలో తాను విక్రయించిన స్థలం ఎదుట తనకు ఉన్న అదే సర్వే నంబర్‌లోని 35.38 గజాల భూమిని విక్రయిస్తానని చెప్పాడు. ఆ స్థలాన్ని సైతం కొనుగోలు చేస్తే ఇంటి నిర్మాణంతోపాటు షెటర్ ఏర్పాటు చేసుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్వహించుకోవచ్చునని గణేశ్ భావించాడు. మార్కెట్ ధర ప్రకారం కొనుగోలు చేయగా.. మొండయ్య ఈ భూమిని 2020 జూలై 21న జగిత్యాల సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో గణేశ్‌కు (డాక్యుమెంట్ నెంబర్ 4589/2020) రిజిస్ట్రేషన్ చేశాడు. నెల రోజుల తర్వాత గణేశ్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. భర్త మృతి చెందడం, అప్పులు కావడంతో విధి లేని పరిస్థితిలో గణేశ్ భార్య శ్రీదేవి గణేశ్ డెత్ సర్టిఫికెట్ సహాయంతో 212.80 గజాల భూమిని, అలాగే 35.38 గజాల భూమిని ఆమె తమ్ముడైన కాలేరు చంద్రశేఖర్‌కు 2022 నవంబర్ 10న (డాక్యుమెంట్ నెంబర్ 6802/2022) ద్వారా విక్రయించింది. తర్వాత చంద్రశేఖర్ 35.38 గజాల స్థలంలో షాపు నిర్మాణం కోసం ధరూర్ గ్రామ పంచాయతీ అనుమతిని కోరగా, ఈ యేడాది ఏప్రిల్ 19న మంజూరు చేసింది. అయితే, అనుకోకుండా చంద్రశేఖర్‌కు పెద్దమొత్తంలో డబ్బులు అవసరం కావడంతో ఆ 35.38 గజాల స్థలంతోపాటు అందులో నిర్మాణంలో ఉన్న గోడలతో సహా ఖాజా అయూబ్ అలీకి విక్రయించాడు. ఈ మేరకు ఈ యేడాది ఏప్రిల్ 22న (డాక్యుమెంట్ నెంబర్ 2808) రిజిస్ట్రేషన్ చేశాడు. అయితే ఆరెల్లి మొండయ్య ఇటీవల వచ్చి ఈ భూమి తనదంటూ అయూబ్ అలీతో గొడవపడడంతో పాటు నిర్మాణంలో ఉన్న ఇంటిని కూల్చివేశాడు. దీంతో అయూబ్ అలీ చంద్రశేఖర్‌ను కలిసి తన డబ్బులు తనకు ఇవ్వాలని, రిజిస్ట్రేషన్‌ను క్యాన్సిల్ చేసుకుంటానని చెప్పడంతో విధిలేని పరిస్థితిలో అతడి డబ్బులను తిరిగి ఇచ్చి ఈ యేడాది మే 3న చంద్రశేఖర్ రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ చేసుకున్నాడు. కాగా, మొండయ్య మోసం చేశాడంటూ చంద్రశేఖర్, అతడి సోదరి శ్రీదేవి జగిత్యాల రూరల్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసుల వద్దకు వచ్చిన మొండయ్య తాను గణేశ్‌కు భూమిని విక్రయించలేదని బుకాయించాడు. సర్వేనెంబర్ 179/ఈలో తనకు ఉన్న భూమిలో నుంచి 60 గజాల భూమిని 2005లో తన భార్య లక్ష్మికి గిఫ్ట్ డీడ్ చేశానని పేర్కొన్నాడు. అందుకు సంబంధించి 280/2005 నాటి మల్యాల సబ్ రిజిస్ట్రేషన్‌కు చెందిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ను పోలీసులకు అందజేశాడు. జగిత్యాల సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో మొండయ్య స్వయంగా గణేశ్ పేరిట చేసిన రెండు డాక్యుమెంట్లు ఉండడం, అలాగే మల్యాల సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో 2005లో తన భార్య లక్ష్మి పేరిట 60 గజాల భూమిని గిఫ్ట్‌డీడ్ చేసిన డాక్యుమెంట్ ఉండడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది.

జగిత్యాల, జూన్ 10, (నమస్తే తెలంగాణ) : 1985 కంటే ముందు బ్లాక్ పంచాయతీలు, తదుపరి తాలూకా (పంచాయతీ సమితి) వ్యవస్థ కొనసాగిన సందర్భంలో బ్లాక్ పంచాయతీ లేదా తాలూకా పరిధిలో సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసులు ఏర్పాటు చేశారు. పంచాయతీ సమితి పరిధిలోని గ్రామాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ వ్యవహారాలు అక్కడే నిర్వహించేది. అయితే, 1985లో పంచాయతీ సమితి వ్యవస్థ రద్దయి మండల వ్యవస్థ రూపుదిద్దుకున్నది. ఈ నేపథ్యంలో పలు పంచాయతీల సమితుల పరిధిలోని గ్రామాలను పునర్విభజన చేశారు. అయితే, సబ్ రిజిస్ట్రేషన్ల పరిధులను మార్చకపోవడంతో, గ్రామం ఒక మండలంలో, రిజిస్ట్రేషన్ కార్యాలయం మరో మండలంలో ఉండిపోయింది. ఈ క్రమంలో జగిత్యాల మండలంలో ఉన్న ధరూర్, నర్సింగాపూర్, తదితర గ్రామాలు మల్యాల సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిధిలో కొనసాగుతూ వచ్చాయి. వెల్గటూర్ మండలంలోని కొన్ని గ్రామాలు మల్యాల సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిధిలో ఉండగా, చెగ్యాం, కప్పట్రావుపేట, పాతగూడూరు వంటి గ్రామాలు పెద్దపల్లి జిల్లాలోని సుల్తానాబాద్ సబ్ రిజిస్ట్రేషన్ పరిధిలో కొనసాగాయి. ఒక మండలంలో గ్రామం, మరో చోట సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటూ వచ్చారు. దీనికి తోడు రెవెన్యూ రికార్డులకు సంబంధించిన వివరాలేవీ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు చేరకపోవడంతో, ప్రభుత్వ శాఖల ఆబాది భూముల్లో సైతం యథేచ్ఛగా రిజిస్ట్రేషన్లు జరుగుతూ వచ్చాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, అనంతరం జిల్లాల పునర్విభజన చేయడంతోపాటు, సబ్ రిజిస్ట్రేషన్ల పరిధిలో సైతం మార్పులు తెచ్చారు. 2016 అక్టోబర్‌లో వీలైనంత వరకు సమీపంలో ఉన్న సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోకి గ్రామాల పరిధిని మార్చి, సేవలను చేరువ చేశారు. వెల్గటూర్ మండల పరిధిలోని గ్రామాలను, మల్యాల, సుల్తానాబాద్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల పరిధి నుంచి జగిత్యాల సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిధికి మార్చారు. ధరూర్ జీపీని జగిత్యాల సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిధిలోకి తెచ్చారు. అయితే సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల పరిధి మారినప్పటికీ, ఆయా గ్రామాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో జరిగిన రిజిస్ట్రేషన్ల వివరాలు, రికార్డులను అధికారులు ప్రస్తుతం ఉన్న కార్యాలయాలకు బదలాయించకపోవడంతో సమస్యలకు బీజం పడింది. కార్యాలయాల పరిధిని మార్చడంతో అధికారులు తమ పరిధిలో ఉన్న గ్రామాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు చేస్తూ పోతున్నారు. అంతకు ముందు జరిగిన రిజిస్ట్రేషన్ల వివరాలు ఈ కార్యాలయాల్లో అందుబాటులోకి రాలేదు. సుల్తానాబాద్, మల్యాల సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల నుంచి జగిత్యాల సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు రికార్డులు రావాలి. కానీ, ఎలాంటి రికార్డూ రాలేదు. అలాగే, ఆన్‌లైన్‌లో సర్వే నెంబర్‌పై ఈసీ కడితే సంబంధిత సర్వేనెంబర్‌పై జరిగిన చివరి పది రిజిస్ట్రేషన్ల వివరాలు తెలుసుకోవచ్చు. అయితే, పరిధి మారిన కార్యాలయాల్లో అలా జరగడం లేదు. అయితే చొరవ చూపాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఫలితంగా ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల నిర్లక్ష్యం, పట్టింపు లేని తనం వల్ల ఒకే స్థలానికి సంబంధించి ఇలా రెండు, మూడేసి రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్టు తెలుస్తున్నది. భూ సమస్యను గుర్తించినప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లకపోవడం, పరిష్కారానికి చొరవ చూపకపోవడం అక్రమార్కులకు కలిసి వస్తున్నది. ఇదే అదునుగా కొందరు అక్రమాలకు తెరతీస్తున్నట్టు తెలుస్తుండగా, అధికారుల తీరు విమర్శలకు తావిస్తున్నది.

ఒకే భూమికి వేర్వేరు రిజిస్ట్రేషన్లు

ప్రస్తుతమున్న జగిత్యాల సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జరిగిన రిజిస్ట్రేషన్ల వివరాలు మాత్రమే వస్తున్నాయి. మల్యాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ వివరాలు ఈసీలో రావడం లేదు. మల్యాలకు వెళ్లి అక్కడ ఈసీ కడితే అక్కడి కార్యాలయంలో జరిగిన వివరాలు మాత్రమే వస్తున్నాయి. ఇది కబ్జాదారులకు అవకాశంగా మారింది. దీన్ని బేస్ చేసుకొని ఒకే స్థలాన్ని ఇద్దరికి, ముగ్గురికి సైతం విక్రయిస్తున్నారు. తర్వాత వారు చేసిన మోసం తెలుసుకొని బాధితులు లబోదిబోమంటున్నారు. దీనికి ఉదాహరణ మొండయ్య, గోక గణేశ్ భూ సమస్యే. 2005లో మల్యాల సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో మొండయ్య అతడి భార్య లక్ష్మికి గిఫ్ట్‌డీడ్ చేశాడు. తర్వాత 2015లో జగిత్యాల తహసీల్ ఆఫీస్ నుంచి 2015 జూన్ 5న ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్ (బీ-4330/2015) తీసుకొని దాని ఆధారంగా 2020 జూలై 21న జగిత్యాల సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో గణేశ్‌కు 35.58 గజాల భూమిని రిజిస్ట్రేషన్ చేశాడు. 15 ఏండ్ల క్రితం తన భార్య లక్ష్మికి అదే సర్వే నంబర్‌లో 60 చదరపు గజాలు గిఫ్ట్‌డీడ్ వ్యవహారాన్ని దాచిపెట్టి గణేశ్‌ను, అతడి కుటుంబాన్ని పూర్తిగా మోసం చేసినట్టు తెలుస్తున్నది. అయితే 2005లో మల్యాలలో చేసిన గిఫ్ట్ డీడ్‌లో, తర్వాత 2022లో గణేశ్‌కు చేసిన రిజిస్ట్రేషన్‌లో చూపిన నైబర్ల పేర్లు ఒకేలా ఉంచడం ఆయన చేసిన మోసానికి సాక్ష్యంగా నిలుస్తున్నది.

గతంలో జరిగినవి ఆన్‌లైన్ కాలేదు

ఈ విషయమై జగిత్యాల సబ్ రిజిష్ట్రార్‌తో మాట్లాడగా, 2016 అక్టోబర్ తర్వాత మార్చిన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల పరిధిలో జరిగిన రిజిస్ట్రేషన్ల వివరాలు, అలాగే అదే సర్వేనెంబర్‌లోని భూములు, ఇండ్లపై గతంలో పూర్వ సబ్‌రిజిస్ట్రేషన్ల పరిధిలో జరిగిన రిజిస్ట్రేషన్ల వివరాలు ఆన్‌లైన్ కాలేదని తెలిపారు. ఒక ఇంటికి లేదా ఇంటి స్థలానికి సంబంధించిన రిజిస్ట్రేషన్లు పూర్తిగా తెలుసుకోవాలంటే, పూర్వ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో, ప్రస్తుత రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఈసీలు తీసుకోవాలని సూచించారు. లేనట్టయితే పూర్తి వివరాలు తెలియడం లేదన్నారు. ఈ వ్యవహారం వల్ల ఇబ్బందులు వస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, పూర్వ, ప్రస్తుత కార్యాలయాల రికార్డులను ఒకే చోట ఆన్‌లైన్ అయ్యేలా చూస్తే తప్ప ఈ సమస్యకు పరిష్కారం లభించదని తెలిపారు.

మాకు న్యాయం చేయండి

మాకు తీవ్ర అన్యాయం జరిగింది. దాదాపు కోటి రూపాయల విలువైన షెటర్ భూమితోపాటు అంతకు ముందు కొనుగోలు చేసిన 212.80 గజాల భూమి సైతం ఇబ్బందికరంగా మారింది. మేం కొన్న స్థలంలో ఇంటి నిర్మాణం చేపడితే కూలగొట్టి ఆర్థికంగా నష్టపరిచారు. మా స్థలం వద్ద మనుషులను పెట్టి బెదిరిస్తున్నారు. అటువైపు వెళ్లేందుకే భయమేస్తున్నది. అధికారులు స్పందించి విచారణ జరిపి మాకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

- గోక శ్రీదేవి, కాలేరు చంద్రశేఖర్, భూ బాధితులు

ఆగిన సరస్వతీ పుత్రుడి ఊపిరి

- ఇటీవల ఇంటర్ ఫస్టియర్‌లో 470కి 466 మార్కులతో టాప్
- బ్రెయిన్ ఇన్‌ఫెక్షన్‌తో చికిత్స పొందుతూ మృత్యుఒడికి

శ్రీవత్సవ్(ఫైల్)

మంథని, జూన్ 10: ఇటీవలి ఇంటర్ ఫస్టియర్‌లో సత్తా చాటిన సరస్వతీ పుత్రుడి ఊపిరి ఆగిపోయింది. బ్రెయిన్ ఇన్‌ఫెక్షన్‌తో దవాఖానలో చేరి చికిత్స పొందుతూ మృతి చెందడం విషాదం నింపింది. మంథని పట్టణంలోని హనుమాన్‌నగర్ (ఎరుకులగూడెం)కు చెందిన సుతారి రమా-శ్రీనివాస్ దంపతులకు ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకు సుతారి శ్రీవత్సవ్(18) చదువులో ఎంతో చురుగ్గా ఉండేవాడు. బాల్యం నుంచే చదువులో రాణిస్తూ ఇటీవల ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో 470 మార్కులకు 466 మార్కులు సాధించాడు. ఈ నెల 7న అకస్మాత్తుగా అస్వస్థతకు గురికాగా, తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. శ్రీవత్సవ్ బ్రెయిన్‌లో ఇన్‌ఫెక్షన్ వచ్చినట్టు వైద్యులు చెప్పారు. క్రమంగా గుండె, బ్రెయిన్, కిడ్నీలు పని చేయడం మందగించి, చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం చెందాడు. చెట్టంత ఎదిగిన కొడుకు ఇలా చనిపోవడంతో తల్లిదండ్రులు ఒక్కసారిగా బోరుమన్నారు. చదువులో రాణించి ఉన్నత స్థానాలకు చేరుతాడనుకుంటే ఇలా అర్ధంతరంగా వెళ్లిపోయాడంటూ రోదించారు.

కేశోరాంలో టెన్షన్.. టెన్షన్

- సైలోటవర్ ఎక్కిన 16 మంది కార్మికులు
- బేసిక్ పర్మినెంట్‌లో అన్యాయం జరిగిందని ఆవేదన
- రెండుగంటలపాటు నిరసన
- నాయకులు, అధికారుల చొరవతో టవర్ దిగొచ్చిన కార్మికులు

కేశోరాం ఫ్యాక్టరీలో సైలోటవర్ ఎక్కి ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

పాలకుర్తి, జూన్10: పాలకుర్తి మండలం బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో సోమవారం టెన్షన్ వాతావరణం నెలకొన్నది. జనరల్‌షిఫ్టులో 16 మంది కాంట్రాక్టు కార్మికులు సైలోటవర్ ఎక్కి ఆందోళన దిగడం కలకలం రేపింది. ఇటీవల యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులకు సీనియార్టీ ప్రకారం ప్రకటించిన బేసిక్ పర్మినెంట్ జాబితాలో తమకు అన్యాయం జరిగిందని, వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సుదీర్ఘకాలంగా కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న తమకు బేసిక్ పర్మినెంట్ అవకాశం కల్పించాలని, న్యాయంగా పీఎఫ్, ఈఎస్ఐ ప్రయోజనాలతో సీనియార్టీతో జాబితా సిద్ధం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. సుమారు రెండుగంటల పాటు టవర్‌పైనే ఉండడం టెన్షన్ పుట్టించింది. షిఫ్టు అధికారులు, తోటికార్మికుల సమాచారం మేరకు బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి, ప్లాంట్ హెడ్ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఆర్‌హెడ్ పార్థసారథి, యూనియన్ నాయకులు మనోహర్‌రెడ్డి, సూరసమ్మయ్య, బీఆర్ఎస్ నాయకులు కౌశిక హరి అక్కడికి చేరుకున్నారు. బేసిక్ పర్మినెంట్ జాబితాలో సీనియర్లను కాదని, జూనియర్లకు వచ్చినట్లయితే పరిశీలించి న్యాయం చేస్తామని ప్లాంట్‌హెడ్ శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇవ్వడంతో కార్మికులు శాంతించారు. ఏఎస్‌వో రవీందర్‌రెడ్డి సైలోటవర్ ఎక్కి ఒక్కొక్క కార్మికుడిని కిందకు దింపడంతో కేశోరాం అధికారులు, పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.

మహిళలపై బీజేపీ నేత లైంగిక వేధింపులు!

మొదటిపేజీ తరువాయి...

ఆరోపణలకు క్షమాపణ చెప్పడంతోపాటు అన్ని సామాజిక మాధ్యమాల నుంచి మూడు రోజుల్లో ఆ వ్యాఖ్యలను తొలగించాలని లేదా చట్టపరమైన అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొంటూ ఒక నోటీసు పంపింది. ముందుగా మాలవీయకు కలిగిన మానసిక క్షోభకు, గౌరవ భంగానికిగాను నష్టపరిహారం కింద రూ.10 కోట్లు డిమాండ్ చేసింది. బీజేపీ నేత రాహుల్ సిన్హాకు బంధువు అయిన శంతను సిన్హా ఇటీవల ఫేస్‌బుక్‌లో మాలవీయకు వ్యతిరేకంగా ఒక పోస్ట్ పెట్టారు. మాలవీయ పలువురు మహిళలపై లైంగిక దాడులకు పాల్పడ్డాడని, అనేక నీచమైన చర్యలలో భాగస్వామి అని ఆరోపించారు. ఈ ఆరోపణలపై కాంగ్రెస్ పార్టీ స్పందిస్తూ.. తక్షణం మాలవీయ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. మాలవీయ చేతిలో లైంగిక దోపిడీకి గురైన మహిళలకు బీజేపీ న్యాయం చేయాలని కాంగ్రెస్ నాయకురాలు సుప్రియా శ్రీనేథ్ డిమాండ్ చేశారు. ప్రధానిగా మోదీ ప్రమాణం చేసిన 24 గంటల్లోనే ఓ ప్రముఖ బీజేపీ నేతపై తీవ్రమైన ఆరోపణలు వచ్చాయని పేర్కొన్నారు. మాలవీయ చర్యలపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని అన్నారు.

వ్యాఖ్యలు ఉపసంహరించుకోను: సిన్హా

ఫేస్‌బుక్‌లో తాను చేసిన వ్యాఖ్యలు ఎవరినీ ఉద్దేశించినవి కావని శంతనుసిన్హా స్పష్టం చేశారు. కొందు బీజేపీ నేతలు తమ అధికార పదవులను కాపాడుకోవడం కోసం తమ ఢిల్లీ బాస్‌లను ప్రసన్నం చేసుకోవడానికి అనేక అక్రమ మార్గాలను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. ఫేస్‌బుక్‌లో తన పోస్ట్‌ను తప్పుగా అర్థం చేసుకున్నారని అన్నారు. తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని, సామాజిక మాధ్యమం నుంచి వాటిని తొలగించలేదని, ఒత్తిళ్లకు లొంగే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తనకు అందిన లీగల్ నోటీసుకు సమాధానం ఇచ్చేందుకు కొంత సమయం కావాలని కోరానని తెలిపారు.

నీట్ అక్రమాలపై విద్యార్థుల గర్జన

కేంద్ర విద్యా శాఖ ఆఫీస్ వద్ద విద్యార్థి సంఘాల ఆందోళన

- నీట్-2024ను రద్దు చేయాలని సుప్రీంకోర్టులో పిటిషన్
- నీట్ పరీక్షను తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలి
- తమిళనాడు ప్రభుత్వానికి హైకోర్టు రిటైర్డ్ జడ్జి కమిటీ సిఫార్సు

నీట్ అక్రమాలపై హైదరాబాద్‌లో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల ధర్నా

న్యూఢిల్లీ/చెన్నై, జూన్ 10: దేశవ్యాప్తంగా వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్ యూజీ-2024 ప్రవేశ పరీక్షలో అక్రమాలపై దర్యాప్తు జరుపాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు సోమవారం ఢిల్లీలోని కేంద్ర విద్యా శాఖ కార్యాలయం సమీపంలో ఆందోళన చేపట్టాయి. పరీక్ష నిర్వహణలో అక్రమాలు జరిగినట్టు వస్తున్న ఆరోపణలపై స్వతంత్ర, పారదర్శక విచారణ చేయాలని జేఎన్‌యూ విద్యార్థి సంఘం ఉపాధ్యక్షుడు అవిజిత్ ఘోష్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రవేశ పరీక్ష సమగ్రతను కాపాడేందుకు మరింత విశ్వసనీయమైన, సురక్షితమైన పరీక్షా విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దని, నీట్ అంశంపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల విడులైన నీట్-యూపీ పరీక్షా ఫలితాల్లో ఏకంగా 67 మందికి మొదటి ర్యాంకు రావడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. అయితే పరీక్ష నిర్వహణలో ఎలాంటి అవకతవకలు జరుగలేదని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) చెబుతున్నది.

కౌన్సెలింగ్‌పై స్టే విధించాలి

నీట్ యూజీ-2024 ప్రవేశపరీక్షను రద్దు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. అదేవిధంగా మే 5న నిర్వహించిన ఈ పరీక్షలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు జరిపేందుకు సిట్ ఏర్పాటు చేయాలని, పేపర్ లీక్ ఆరోపణలపై దర్యాప్తు పూర్తయ్యే వరకు కౌన్సెలింగ్‌పై స్టే విధించాలని పిటిషన్‌దారులు అభ్యర్థించారు. పరీక్ష నిర్వహణ హేతుబద్ధంగా లేదని, విద్యార్థులకు బ్యాక్‌డోర్ ద్వారా ప్రవేశాలు కల్పించేలా అక్రమాలు జరిగాయని ఆరోపించారు.

ప్లస్ 2 మార్కులే ప్రామాణికంగా ఉండాలి

నీట్ ప్రవేశపరీక్షను తొలగించేందుకు చట్ట, శాసనపరమైన చర్యలు తీసుకోవాలని మద్రాస్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏకే రాజన్ నేతృత్వంలోని కమిటీ తమిళనాడు ప్రభుత్వానికి సిఫారసు చేసింది. వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు హయ్యర్ సెకండరీ ఎగ్జామినేషన్(ప్లస్ 2) తరగతిలో వచ్చిన మార్కులను ప్రామాణికంగా తీసుకోవాలని సూచి ంచింది. వివిధ పరీక్ష బోర్డుల విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నది. తమిళనాడు విద్యార్థులపై నీట్ ప్రభావంపై అధ్యయనానికి ఈ కమిటీని డీఎంకే ప్రభుత్వం 2021లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పాటు చేసింది.

మహా రైతుల కన్నెర్ర

- కరువు రాయితీల కోసం నేషనల్ హైవే బిగ్బంధం
- ప్రభుత్వ జాప్యంపై అన్నదాతల ఆగ్రహం

లాతూర్, జూన్ 10: కరువు రాయితీలు, ఇతర ఉపశమన ఆర్థిక ప్రయోజనాలు అందించడంలో జాప్యాన్ని నిరసిస్తూ వందలాది మహారాష్ట్ర రైతులు సోమవారం లాతూర్-అంబేజోగయి హైవేను దిగ్బంధించారు. రెనాపూర్ తహశీల్‌ను ప్రభుత్వం కరువు ప్రాంతంగా ప్రకటించినప్పటికీ రైతులకు ఇంకా కరువు రాయితీలు అందలేదని ధర్నాకు నాయకత్వం వహించిన షేత్కరీ సంఘటన నాయకుడు గజన్ బొలంగే తెలిపారు. రహదారి దిగ్బంధం రెండు గంటల పాటు సాగింది. ఈ సందర్భంగా వారు తహశీల్ కార్యాలయ గేటును మూసివేసి నిరసన తెలిపారు. '70 శాతానికి పైగా అర్హులైన రైతులకు కరువు రాయితీలు లేదా ఇతర ఉపశమన ప్రయోజనాలు అందలేదు. దీనిపై తహసీల్దార్ వివరణ ఇవ్వాలి. ఇంకా రైతుల ఖాతాల్లోకి డబ్బులు ఎందుకు వేయలేదో అధికారులు బ్యాంకులను అడగాలి' అని గజన్ అన్నారు. ఒక హెక్టార్‌కు రూ.50 వేల పంట బీమా రాయితీని కూడా రైతులు కోరుకుంటున్నారని ఆయన తెలిపారు. ఈ నెల 20లోగా కరువు రాయితీలు అందించకుంటే రెనాపూర్ ప్రాంతంలో మరింత పెద్ద ధర్నా నిర్వహిస్తామని రైతు నాయకుడు దత్తాజీ షిండ్గే హెచ్చరించారు.

సత్నామీల నిరసన హింసాత్మకం

ఎస్పీ ఆఫీసు నుంచి వెలువడుతున్న పొగ

బలోడా బజార్: సత్నామీ తెగవారు అత్యంత పవిత్రంగా పరిగణించే జైత్‌ఖామ్బ్ (స్థూపం)ను గుర్తు తెలియని వ్యక్తులు అపవిత్రం చేయడంతో నిరసనలు పెల్లుబికాయి. ఛత్తీస్‌గఢ్ గిరౌడ్‌పురి ధామ్‌లోని అమర్ గుహలో ఉన్న ఈ పవిత్ర చిహ్నాన్ని గత నెల 15-16 మధ్య రాత్రి అపవిత్రం చేశారు. ఈ కేసులో పోలీసులు ముగ్గుర్ని అరెస్ట్ చేశారు. అయితే ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తూ, కలెక్టర్ కార్యాలయం వద్ద ఘెరావ్ నిర్వహించాలని సత్నామీ తెగవారు పిలుపునిచ్చారు. బలోడా బజార్ పోలీసు సూపరింటెండెంట్ సదానంద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, దాదాపు 5,000 మంది నిరసనకారులు తరలివచ్చి, కలెక్టర్ కార్యాలయంలోకి దూసుకెళ్లారు. రాళ్లు విసురుతూ, కొన్ని వాహనాలను తగులబెట్టారు. ఎస్పీ కార్యాలయానికి నిప్పు పెట్టారు. ఈ కార్యాలయంలో కొంత భాగం దెబ్బతింది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పి, పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

మణిపూర్ సీఎం సెక్యూరిటీ కాన్వాయ్‌పై దాడి

భద్రతా సిబ్బందిలో ఒకరికి గాయాలు

ఉగ్ర దాడిలో గాయపడిన భద్రతా సిబ్బందిని పరామర్శిస్తున్న బీరేన్ సింగ్

ఇంఫాల్ : మణిపూర్ సీఎం బీరేన్ సింగ్ సెక్యూరిటీ కాన్వాయ్‌పై మిలిటెంట్లు కాల్పులకు తెగబడ్డారు. కాంగ్‌పోక్పి జిల్లాలో సోమవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. మిలిటెంట్ల దాడిలో కాన్వాయ్‌లోని ఓ వాహనం డ్రైవర్ కుడి భుజానికి బుల్లెట్ గాయమైంది. ఇటీవల హింస చెలరేగిన జిర్‌బామ్ జిల్లాలో సీఎం మంగళవారం పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తు భద్రతా ఏర్పాట్లలో భాగంగా కాన్వాయ్ వెళ్తుండగా కొట్లెన్ గ్రామానికి సమీపంలో మిలిటెంట్లు దాడికి దిగారు. కాన్వాయ్‌లోని వాహనాలపై పలుమార్లు కాల్పులు జరిపారని, భద్రతా బలగాలు మిలిటెంట్ల కోసం కూంబింగ్ ఆపరేషన్ చేపట్టినట్టు చెప్పారు.

ఏడాది దాటినా మణిపూర్‌లో శాంతి ఏదీ?

ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్

నాగపూర్‌లో ప్రసంగిస్తున్న భాగవత్

నాగపూర్, జూన్ 10: మణిపూర్ హింసపై ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. హింస చెలరేగి ఏడాది దాటుతున్నా.. ఆ రాష్ట్రంలో శాంతియుత పరిస్థితులు నెలకొనటం లేదంటూ పాలకుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం నాగపూర్‌లో ఆరెస్సెస్ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. మణిపూర్ హింసను అత్యంత ప్రాధాన్యత గల అంశంగా పరిగణించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మోహన్ భగవత్ సూచించారు. శా